# సరళా మోహనులు

అరవ వెంకటస్వామిగారు

## ౧

"కామయ్యా! నామాట విను. నీ కుమార్తె సరళను మాతో పంపించు. ఆమెకు బి. ఏ. వరకూ చదువు చెప్పించి, మంచి ఉద్యోగం వేయిస్తాం. అంతవరకూ భోజనముకూ, దుస్తులకూ అయ్యే ఖర్చు అంతా మేమే భరిస్తాం. మా యేసుదేవునిసాక్షిగా చెబుతున్నాం. నీ పుత్రికకు ఏలోటూ రాదు." అన్నది నెల్సనుదొరసాని.

నెల్సను భీమవరం తాలూకాలో క్రైస్తవమత ప్రచారకురాలు. ఆమెవెంట మిషన్ బాలికాపాఠశాల ఉపాధ్యాయ, మరి యిద్దరు ఉపాధ్యాయులూకూడా ఉన్నారు.

"ఏమోతల్లీ, నాసరళ నాదగ్గర ఉంటేనే నాకు ఆనందంగా ఉంటుంది. పిల్లకి పంద్రెండేళ్లు వచ్చినై. ఇంతవరకూ ఒక్కరోజైనా నేను దాన్ని ఎడబాసి ఉండలేదు. మీబట్టలకూ, మీకూ, మీమతానికీ ఒక నమస్కారం. సరళ ఉద్యోగం చేసి, ఎవర్నీ ఉద్ధరించనక్కరలేదు" అన్నాడు కామయ్య.

నెల్సను ఎంత చెప్పినా వినలేదాతడు. ఆమె పర్సునుండి రెండువందల రూపాయలనోట్లు తీసి కామయ్యచేతి కివ్వబోయింది. తనజీవితంలో ఎన్నడూ అన్ని రూపాయలు చూడని కామయ్యహృదయం చలించింది. మహాదారిద్ర్యం అనుభవిస్తూన్న కామయ్యనేత్రాల్లో మెత్తదనం ప్రతిఫలించింది. అది చూచి ఉపాధ్యాయ విజృంభించి, తాము చేయబోయే లాభాన్నిగురించి మృదుమధురంగా ఉపన్యసించింది.

కామయ్య ఆనోట్లు అందిపుచ్చుకున్నాడు. నెల్సనుదొరసానీ, తదితరులూ లేచినారు. కామయ్య "అమ్మా, సరళా, ప్రతిశనివారమూ నిన్ను వచ్చి చూస్తూంటాను. తోడిపిల్లలతో జగడమాడక జాగ్రత్తగా ఉండమ్మా. మేష్టర్లను ఎదిరించక, బుద్ధిమంతురాలనిపించుకోవాలి" అన్నాడు. చిన్నప్పటినుంచీ పెంచిన ప్రేమచేత, ఉవ్వెత్తుగ పొంగివచ్చిన దుఃఖం అతని కంఠానికి గాద్గద్యం ఆపాదించింది.

సరళచేయి నెల్సనుదొరసాని పట్టుకుంది. తన తండ్రితోడివియోగము భరింపలేని సరళకు విచారం సముద్రతరంగాల్లా పొంగి పొరలి వచ్చింది. ఆమె విశాల తరళనయనాలనుండి నాలుగైదశ్రుబిందువులు జాలువారినై. తనపరికిణీచెరగుతో ఆదుఃఖాశ్రువులు తుడుచుకొని సరళ తనదృష్టిపథాన్నుండి జనకుడు అంతర్హితుడయ్యేవరకూ తిరిగి తిరిగి చూస్తూ వెళ్లింది. కామయ్య కూడా అలాగే చూసి చూసి ఉస్సురని వేడినిట్టూర్పు విడిచి తనగుడిసెలోకి వెళ్లిపోయాడు.

కామయ్య పంచముడు. భీమవరంలోనే వెంకటప్పయ్య అను కమ్మదొరకు రైతుగా పనిచేస్తూ కుటుంబపోషణ చేసుకుంటున్నాడు. అతనిభార్య చాలకాలం క్రితమే చనిపోయింది. సరళ నంతకు ముందు మిషన్ బాలికాపాఠశాలలోనికి విద్యాభ్యాసంనిమిత్తం పంపిస్తూన్నాడు. ఆమె తెలివితేటలూ, వినయవిధేయతలూ అందరినీ ఆకర్షించినవి.

## ౨

సంజకెంజాయతో నిండి, ఆకసము చూడడానికి ఇంపుగా ఉన్నది. వియత్పథమునంటే వృక్షాల నుండి చల్లనిపిల్లగాలులు వీస్తున్నవి. మోహనరావూ, అతని మిత్రుడు లక్ష్మణరావూ వస్తున్నారు, కబుర్లు చెప్పుకుంటూను. ఇంతలో యిద్దరు యువతులు వారి కెదురైనారు. అందులో ఒక యువతి సరళ. సరళ యిపుడు వెనుకటి పంచమబాలిక కాదు. నవయౌవనోద్భాసితయై వెలుగొందు సౌందర్యవతి. ఆమె పేరు మేరీ సరళ. నెల్సనుదొరసాని కామయ్యవద్దనుండి ఆమెను తీసికొని వెళ్లిన మరునాడే ఆదివారం కావడంచేత

చర్చికి తీసుకుపోయి శుద్ధిస్నానం (Baptise) చేయించి క్రైస్తవమతంలో చేర్చి పేరు మార్పించింది.

సరళ వారిని సమీపించింది. అసాధారణలావణ్యవతియూ, అసమానసుందరియూ నైన ఆమెను మోహనరావూ, నవమోహనాకారుడైన మోహనరావును ఆమే చూచుచున్నారు. వారి యిరువురిదృష్టులూ ఏకీభవించినై. మోహనరావామెను చూస్తూ నిశ్చేష్టుడై పోయినాడు. సరళ మరొకసారి క్రీగంట మోహనరావును చూసి వెళ్లిపోయింది. ఆమె వెళ్లినవంకే తనదృష్టి నిల్పిఉన్న మోహనరావు వీపుమీద లక్ష్మణరావు చేతితో తట్టి, "ఏమోయ్! మతి గాని పోయిందా?" అన్నాడు.

ఉలికి పడ్డాడు మోహనరావు. కొంచెం సిగ్గుపడి, అతడు "స్నేహితుడా! ఆమె ఎవరు?" అని ప్రశ్నించినాడు.

"ఇంకెవరు? మనపాలిటి ఏసుదేవతలు."

ఇంకనేమీ మాట్లాడుకోలేదు వారు. మోహనరావు ఆలోచనాధీనుడైనాడు. అతడు తనయింటికి వెళ్లి పుస్తకములు గదిలోని టేబిలుమీద ఉంచి, యీజిచైరులో కూలబడినాడు. ఆతని మనోవీథిని సరళసౌందర్యస్వరూపమే గోచరించింది. ఒక్కసారిగా అతనిహృదయం వికలమైపోయింది. క్రైస్తవయువతులని ఎంతమందినో చూశాడతడు. అందరూ డాంబికపరులే అనీ, వారివేషాలు కృత్రిమములనీ అతనినమ్మిక. సరళ సహజసౌందర్యవతి. క్రైస్తవులలో గాని, హిందువులలో గాని అంతఅందమైన యువతి ఉండడం అరుదని తలంచినాడాతడు. ఎన్నో ఆలోచనలు సెలయేటి చిరుతరంగాల్లా ఒకటితరవాత మరొకటిగా అతనిమనస్సున కలిగినవి. ఆమె అవివాహితో, లేక వివాహితో తెలవడం ఎల్లాగ అని తర్కించుకొన్నాడు.

మోహనరావు మరునాడు బాలికాపాఠశాలదగ్గరికి వెళ్లి నౌకరుతో మంచిమాటలాడి ఆమె కింకా పెండ్లి కాలేదని తెలుసుకొన్నాడు. అతనిచిత్తంలో మహాసంగ్రామము బయలుదేరింది. తాను ధనికుడు. పేరుపొందిన కమ్మవారియింటిబిడ్డ. తండ్రి బాల్యదశలోనే గతించడంవల్ల తానే యిప్పుడు తనఆస్తినీ, నిలవసొమ్ము రెండులక్షలరూపాయలనుగురించిన వ్యవహారాలనీ చూసుకుంటున్నాడు. తల్లి ఉన్నది. వివాహమైనది. రెండు సంవత్సరాలప్రాయము కల కుమారుడు కూడాను. తల్లి, భార్య, కుమారుడు, అపారభాగ్యము కలిగిన తనకు ఆ మేరీ సరళతో ఎట్లు సంబంధము పొసగుతుంది? సరళ లేక తాను జీవించగలడా? ఒకవేళ తనహృదయాన్ని దహించుతూ ఉన్న ప్రేమానలము చల్లార్చికోవడానికి స్వతంత్రించి, సాహసించి, తనప్రేమని సరళకు తెలియజేసినపుడామె తిరస్కరిస్తే మాత్రం బ్రతకగలడా? ఏమీ తోచటంలేదు. ఎంతసేపూ ఆముద్దుమొగమే, ఆ సోగలుతీరిన విశాలనేత్రములే, ఆనీలకుటిలకుంతలములే, పరిపుష్టి నందిన ఆ [illegible]ములే, ఆ మందస్మితవదనారవిందమే, ఆ ప్రేమమూర్తి సరళ దివ్యసుందరవిగ్రహమే ఆతని కన్నులయెదుట మహదానందమూర్తియై తాండవిస్తూన్నది. తన సంపద సర్వమూకూడా ఆ క్రైస్తవయువతికోసం పరిత్యజించడానికి నిశ్చయించుకొన్నాడు, మోహనరావు. ఆమెను చూడనినాడు ఏపని చేయడానికి మనస్సు ఒప్పదు. ప్రతిరోజు అతడు సరళ స్కూలునుంచి వచ్చేటప్పుడు మార్గమున వేచి ఉండి ఆమె ముగ్ధమోహనమూర్తిని చూసి, సంతృప్తచిత్తముతో యింటికి వెళుతుంటాడు. ఆమె కనబడకపోతే ఏదో ముఖ్యమైనవస్తువును పోగొట్టుకొన్నట్లు, ఉన్మాదునివలె, విభ్రాంతుడై తిరుగుతూ ఉంటాడు. ప్రతి ఆదివారము అందరికంటే ముందు తానే చర్చికి వెళ్లుతాడు. ఎందుకు? తన హృదయాధిదేవత, తన మనోహరి, మేరీసరళను చూడడానికి. అక్కడ జరిగే ప్రార్థనలసంగతి క్రీస్తుదేవునకే తెలియాలి. మోహనరావూ, మేరీ సరళా దృష్టులమూలంగా తమ మనోగత భావాలు ప్రకటించుకొంటూ ఉంటారు. ఆమెను చూసినపిమ్మట మోహనరావు హృదయంలో ఏవిధంగా దారుణసంగ్రామ మేర్పడిందో, ఆమె మనస్సులోకూడా అటువంటి పరివర్తనము కలగక పోలేదు. ప్రణయవిహ్వలములైన దృష్టులతోనే ఊరటచెందటం దుర్భరం. ఆమెతో సంభాషింపవలెనని మోహనరావుచిత్తము

వేగిరపడుతున్నది. కాని ఏవిధంగానూ మాట్లాడడానికి సందర్భం కలగటంలేదు. ఒక్క ఉత్తరం వ్రాస్తే బాగుంటుందనుకొని వ్రాశాడు కాని, ఆ ప్రణయలేఖని తపాలుద్వారా పంపితే ఏఉపాధ్యాయురాలైనా అందుకొని చూస్తే మేరీ సరళ తనహృదయేశ్వరి భవిష్యజ్జీవితం భంగపడే పరిస్థితులు సంభవిస్తవేమో అని భయపడి, ఆదివారంనాడు చర్చికి వెళ్లాడు, తానే అందచేద్దామని.

అందరూ ప్రార్థనలహడావిడిలో ఉండగా మోహనరావు ఉత్తరము చూపించి, మేరీ సరళ పాదాల చెంత పడునట్లు విసిరినాడు. కాని ఆతని దురదృష్టంవల్ల ఆలేఖ మేరీ సరళ ప్రక్క ఉన్న బాలికపాదాలవగ్గర పడింది. అది చూచి మేరీ సరళ తటాలున ఆవలపుకమ్మ తీసుకొన్నది. ఆమె ప్రక్క ఉన్న బాలిక ఏమీ యెరగనట్లు నటించి, తల పంకించింది ఒకసారి. ప్రార్థనలు ముగిసినతరువాత అందరూ వెళ్లిపోయారు. ఆబాలిక ఉపాధ్యాయతో మేరీసరళ కెవరో యువకుడు ప్రేమజాబు వ్రాశాడనీ, వారిరువురూ ప్రార్థనలు జరుగుతూన్నంతకాలమూ ఒకరి నొకరదేపనిగా చూసుకొన్నారనీ చెప్పింది. ఉపాధ్యాయు అన్నీ విని తల ఊపి, "సరే, నువ్వు వెళ్లిపో; నేను వెళ్లి మేరీసరళతో మాట్లాడుతా" నంది.

మేరీసరళ చర్చినుండి హాస్టలుకు వచ్చినతరవాత తనగదిలో కూర్చుని మోహనరావు వ్రాసిన వలపుకమ్మ చదువుకుంది. ఒకసారి—రెండోసారి—మూడోసారి—పదిసార్లు చదివింది. తనివి తీరటంలేదు. నవయౌవనాశాభరితమైన ఆమెహృదయం నిరతిశయానందంలో నిండిపోయింది. తనకొరకు తన తల్లిని, అనంతభాగ్యమునూ, మతమునూ సర్వమూ త్యజించి వివాహ మాడడానికి సిద్ధంగా ఉన్నానని వ్రాయబడిన ఆ వలపుకమ్మని మేరీసరళ ఎన్ని వందలసార్లు చదివిందో చెప్పలేము. ఆమె నేత్రాలు ఆనందబాష్పాక్రాంతములైనవి. కాని యింతలోనే ఆమె హృదయాభ్రవీథిని విషాదసందేహనీరదాలు ఆవరించేయి. తనతండ్రే ధనాశాపరుడై, తన్ను పవిత్ర హిందూమతాన్నుంచి భ్రష్టురాలిని చేశాడు. తన్ను ప్రేమించిన ఆ యువకుడూకూడా తనకొరకు మతభ్రష్టుడు కావడం ఆమె కిష్టంలేదు. 'ఏమిటి కర్తవ్యం' అని ఆలోచిస్తూన్న సమయాన తలుపు గెంటి ఉపాధ్యాయ లోన ప్రవేశించింది. మోహనరావు వ్రాసిన మోహలేఖను మేరీసరళ మేజాబల్లమీద ఉంచింది. ఉపాధ్యాయ అకస్మాత్తుగా రావడంవల్ల ఆమెకు ఆ 'ప్రేమజాబు'ని దాచటానికి అవకాశం లేకపోయింది. ఆమె వచ్చి, మేజా బల్లమీద ఉన్న ఉత్తరం తీసి చదవసాగింది. మేరీసరళగుండెలు అస్వాభావికమైన వేగంతో కొట్టుకొనసాగినవి. పాపం, ఆమెచిత్తం భయోద్విగ్నమయింది.

ఉత్తరం చదివి ఉపాధ్యాయ "మేరీసరళా! నీ యీ ప్రవర్తనమునకు ఏమి సమాధానము చెబుతావు?" అని కోపారుణనేత్రాలతో ప్రశ్నించింది. భయకంపితయై ఉన్న సరళహృదయ సరళ బదులేమీ పలుకక, అవనతవదనయై నిలబడి ఉంది. "నీభవిష్యత్తుకు హానికరమైన పని యిది. నీ యీనడతకి తగినసమాధానం మిస్సమ్మగారిదగ్గర చెబుదువుగాని లే" అని వెళ్లిపోయింది.

సరళకు దుఃఖ మాగిందిగాదు. ఆమె మంచముమీద పడి విలపించసాగింది. కన్నీటికాలువలో ఆ ప్రక్క నిండిపోసాగింది. "ఓపరాత్పరుడా! నీవే నన్ను రక్షింప సమర్థుడ" వని దైవమును ధ్యానించింది.

ఉపాధ్యాయి మిగిలిన ఉపాధ్యాయులను, ఉపాధ్యాయలనూ పిలిపించి, ఆలేఖ వారికి చూపించి, మేరీ సరళఅపరాధానికి తగినశిక్ష చెప్పమంది. ఒకఉపాధ్యాయ "ఆమెకోసం ఎంతో ధనము ఖర్చుపెట్టి యిప్పుడామెను శిక్షించడం తప్పు. ఆమె నీయువకుడు గాఢంగా ప్రేమించినట్లు ఈజాబే చెప్పుతూన్నది. ఈమెకోసం అన్నింటినీ త్యాగముచేయడానికి సిద్ధంగా ఉన్న ఆయువకుణ్ణి మనమతం స్వీకరింపజేయడం, వారియిద్దరికి వివాహం చెయ్యడం శ్రేయస్కరం కాదా" అంది.

ఆమెసలహా అనుసరణీయంగా ఉన్నదని అందరూ నిశ్చయించారు. ఉపాధ్యాయ మేరీసరళకు కబురంపింది. తన్ను స్కూలు విడిచి వెళ్లి పొమ్మంటారేమో, నిరాశ్రయగా చేస్తారేమో అని భయపడుతూ, ఉద్వేల హృదయంతో మేరీసరళ వచ్చింది. ఆమెను చూసి ఉపాధ్యాయ "సరళా! నీలేఖవిషయమై సమాలోచన జరిగింది. నీకు రెండే పద్ధతులు. ఒకటి నీపతనానికీ, రెండోది నీఔన్నత్యానికీ సహాయభూతము లౌతవి. ఆయువకుణ్ణి పిలిపిస్తాం. అతనికి నచ్చచెప్పి క్రైస్తవమతం స్వీకరించేటట్లు నిర్ణయించు. మీయిద్దరికీ పెండ్లి చేస్తాం. లేదా, నీ కింక యీఆవరణలో నిలుచుటకుకూడా తావు లేదు. నీజీవితానికి సుఖం అనేది ఉండదు. ఏం జేస్తా" వని ప్రశ్నించింది.

"అతణ్ణి మతభ్రష్టుని చేయడం నాకు సమ్మతం కాదు" అంది మేరీసరళ. "ఏమీ? సమ్మతం కాదా? సరే. వెళ్లు. భయంకరములైన కష్టములు నీకొరకెదురుచూస్తున్నప్పుడు నామాటలు రుచిస్తవా? నీకు సాయంకాలం వరకూ వ్యవధి యిచ్చాను, బాగా ఆలోచించుకో" అంది ఉపాధ్యాయ.

సరళ తన గదిలోకి వెళ్లింది. మంచముమీద పరుండి తన్ను పరమాత్ముడు పరీక్షచేస్తున్నాడేమో అని తలచింది. ఉపాధ్యాయ గర్జింపువాక్యాలు ఆమె గుండెనిబ్బరం సడలించినవి. ఆమె ఎంతోసేపు ఏడ్చింది. ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది. ఆనిద్రలో సరళకు స్వప్నం కలిగింది. ఆకలలో ఒక త్రిశూలమును ధరించిన కాషాయాంబరధారిణి, యోగిని గోచరించింది. ఆ సన్యాసిని సరళవీపుమీద మెల్లగా తట్టి, "నీవు విచారించవద్దు. ధైర్యముగా ఉండు. నీ ఉపాధ్యాయ ఏం జెయ్యమన్నా వెనుదీయకు. నీకు శుభములు కలుగుతవి" అని చెప్పి, అంతర్ధానమయింది. సరళ మేల్కాంచి, తాను కాంచినది కలా, నిజమా అని భ్రమపడింది. కల అని గ్రహించి, పరిశుభ్రవస్త్రాలు ధరించి, భగవానునిమీదనే భార ముంచి, బయలుదేరింది ఉపాధ్యాయదగ్గరికి.

"ఏం? ఏం నిశ్చయించావు?" అని అడిగింది ఉపాధ్యాయ.

"ఆయనను పిలిపించండి."

"సరే" అని ఉపాధ్యాయ సరళచేత ఒక చిన్న చీటి వ్రాయించింది మోహనరావుకు.

"ఈచీటిప్రకారం అతడు రాత్రి తొమ్మిదిగంటలకు హాస్టలులోకి వస్తాడు. నువ్వు ఏకాంతంగా ఒక గంటసేపు మాట్లాడి అతణ్ణి ఒప్పించు" అని చెప్పింది ఉపాధ్యాయ.

## 3

"ప్రియుడా!

"నీజాబుచూచి చాలా సంతోషించాను. ఉత్తర ప్రత్యుత్తరములతో కాలయాపన జరగడం నా కంత మంచిదిగాతోచలేదు. రాత్రి హాస్టలుదొడ్డితలుపు నీకొరకు తెరిచిఉంచుతాను. తొమ్మిదిగంటలకు రాకోర్తాను.
—నీహృదయేశ్వరి, మేరీసరళ."

అని ఉన్న చీటి చూసుకొని సంభ్రమాశ్చర్యానందములకు లోనైన మోహనరావు ఎప్పుడు భానుడస్తంగతు డవుతాడా అని వేచిఉన్నాడు. రాత్రి పెందలాడె భోజనం చేసి అతడు హాస్టలుదొడ్డిగుమ్మము దగ్గరకు వెళ్లాడు. సరళ అక్కడే ఉన్నది. "రండి లోపలికి" అని ఆమె మోహనరావును తనగదిలోకి తీసుకువెళ్లింది. ఆగదిలో కుడ్యముమీద శకుంతలా దుష్యంతుల ప్రథమసమాగమచిత్ర మున్నది. ఆమెతో ఏం మాట్లాడాలో తోచక మోహనరావు పచారుచేస్తున్నాడు. మేజాబల్లదగ్గరకు వెళ్లాడు. గాజుకుండీలో అమర్చబడిన గులాబిపువ్వులలో ఒకటి తీశాడు. ఇంక ఎంతసేపు ఈమూకీభావం అనుకున్నాడు. కాని సంభాషించడానికి ధైర్యం చాలదు. అదేమిటి? ఎంతో ముచ్చటతో వచ్చి యీఅధైర్యం ఏమిటి? సరళవంక చూశాడు. ఆమె కుడికాలివ్రేలితో క్రింద వ్రాయుచు క్రీగంట అతణ్ణి వీక్షించింది. ఇరువురిచూపులూ ఐక్యమైనవి. అతడు ఆమెవెనుకకు వెళ్లి గులాబీపువ్వు నామె

జడలో తురిమి, "ఏమండీ! ఎందుకు చీటి వ్రాశారు?" అన్నాడు తమాషాగా, మంచంమీద కూర్చుని.

"అదేమిటే అండి గిండీని? చిన్నపిల్లని నువ్వు అంటారు గాని ఏమండీ అంటారా? భార్యని 'ఏమండీ! పెళ్ళాంగారూ' అంటా రేమిటి? కూర్చోండి మీరా క్కడా" అని వెళ్లిపోబోయింది.

"అబ్బా! అంతలోనే కోపం కాబోలు" అంటూ ఆమెను తన రెండుచేతులతోనూ పైకెత్తి మంచంమీద కూర్చోబెట్టి తాను ఆమెప్రక్కనే కూర్చున్నాడు. మోహనరా విలా అన్నాడు:

"సరళా! నా ఉత్తరంవల్లనే నీకు అన్ని సంగతులూ బోధపడి ఉంటవి. నాసర్వమూ నీకొరకు విడిచిపెట్టడానికి సంసిద్ధుణ్ణయి ఉన్నాను. ఏమిటి నీ అభిప్రాయం?"

"నా అభిప్రాయాని కేమి ఉంది? మీరు నన్నెలా ప్రేమించినారో నేను గ్రహించకపోలేదు. కష్టసుఖాలు ఆలోచించుకోవలసింది మీరు. నేను క్రైస్తవయువతిని. మీరు హైందవయువకులు. నన్ను అభిలషించునపుడు మీరు క్రైస్తవమతం స్వీకరించవలసి ఉంటుంది. నేను దిక్కులేనిదానను. కొన్నాళ్లాదరించి నామీద ఉండే ప్రేమానురాగాలు మరొకరిమీద ప్రసరించే చంచలహృదయు మైతే నాజీవితము అడవిలో పూచిన మల్లెపూవులా నిరర్థక మైపోతుంది."

"సరళా! నా మనస్సు గ్రహించలేదు కనక నీవలా అన్నావు. నీకోసం సర్వమూ త్యజించుటకు సంసిద్ధుణ్ణవడమే నీమీద నాకు ఉండే ప్రగాఢప్రణయాన్ని ప్రకటిస్తుంది. అగ్నిలో ఉరకమన్నా ఉరకడానికి సిద్ధంగా ఉన్నాను నీకొరకు. నేను క్రైస్తవమతం అవలంబిస్తాను. ప్రమాణము చేసి చెబుతున్నాను. చేతిలో చేయి వేస్తాను పోనీ" అంటూ మోహనరావు సరళచేతిలో చేయి వేసి, "సరళా! నీ యీ జగన్మోహనకర సౌందర్యం అనుభవించటానికి ఎన్నాళ్లనుండి వేచి ఉన్నానో తెలుసునా?" అంటూ ఆమెను తనవక్షఃస్థలానికి గట్టిగా అదుముకొని అద్దాలవలె నున్నగా ఉన్న ఆమె చెక్కిళ్లనూ, ముఖమునూ, కెంపెదవులనూ ముద్దులతో నింపివేశాడు. ఊపి రాడింది కాదు సరళకు.

"అబ్బా! ఉండండి మరి. ఏ మాతొందర?" అంటూ మేరీసరళ మెల్లగా అతనికౌగిలినుండి తప్పించుకొని, క్రైస్తవమతావలంబన్నానికీ, వివాహానికీ సమ్మతించినట్లు మాఉపాధ్యాయతో చెప్పండి" అని చరచర వెళ్లి ఉపాధ్యాయని తీసుకువచ్చింది. ఉపాధ్యాయ అడిగినప్రశ్న లన్నింటికి సదుత్తరాలు చెప్పాడు మోహనరావు.

తనబంధుమిత్రు లంతా గర్హిస్తారని ఆత డనగా, ఉపాధ్యాయ "అల్లా అయితే ఓపని చెయ్యండి. మీకు రేపు ఉత్తరం వ్రాసియిస్తాను. రాజమంద్రి వెళ్లిపొండి. వారంరోజులకు మేరీసరళని పంపిస్తాం. ఇద్దరికి అక్కడ ఉన్న మతప్రచారకసంఘంవారే వివాహం చేస్తా"రని చెప్పి వెళ్లిపోయింది.

"మరి నేను పోయి వస్తా" నంటూ మోహనరావు మళ్లీ ఒకసారి ఆవేశముతో ఆలింగనము చేసికొని ముద్దుపెట్టుకున్నాడు సరళని. నక్షత్రాలమధ్య మిలమిల మెరుస్తూన్న చంద్రుడు తనకిరణకాంతిని ఉన్మృక్త వాతాయనమునుండి వా రున్నగదిలోకి ప్రసరింపజేసినాడు. దూరాన కోకిల 'కుహూ' కూజితం మధురంగా వినబడింది.

## ౪

నిశీథసమయం. ప్రకృతి ఎంతో నిశ్శబ్దంగాఉంది. మోహనరావు మెల్లగా ప్రక్కనుండి లేచి, దుస్తులు ధరించి, రెండువేల రూపాయల నోట్లు జేబులో పెట్టుకొని, తాను క్రైస్తవమతం అవలంబిస్తున్నాననీ, తనకొరకు వెదకడం నిష్ప్రయోజనమనీ ఒకచిన్న ఉత్తరం వ్రాసి టేబిలు మీద పెట్టి, కడసారి చూశాడు భార్యాపుత్రులవంక. గాఢనిద్రలోకూడా ఆతనిసతి పెదవులమీద మందహాసం తాండవిస్తూనే ఉన్నది. కుమారుడు, పాపం తండ్రి యింక కనబడ్డని కాబోలు తల్లికి బాగా చేరువగా పడుకొన్నాడు.

మోహనరావు మనోవీథిని యశోధరారాహులుల విడిచిపెట్టినసిద్ధార్థుడు పొడకట్టినాడు. కఠినహృదయముతో ఆతడు మెల్లగా దొడ్డితలుపు తెరుచుకొని ఆఅంధకారసముద్రములో మాయమై పోయాడు.

మరునాటిఉదయ మాతడు రాజమండ్రీ చేరి ఉత్తరమును క్రైస్తవమతప్రచారకసంఘంవారి కిచ్చాడు. వా రీతనికి బస ఏర్పాటు చేసారు. భోజనసదుపాయాలు చేశారు. వారంరోజులకి మేరీసరళకూడా వచ్చింది. వా రిద్దరూ సంభాషించుకోవడానికి సందర్భం అవటం లేదు. ఒకనాడు చర్చిలో కలుసుకున్నారు. మోహనరావు మతప్రచారకసంఘకార్యదర్శి నడిగాడు, ఇంకా ఎప్పుడు వివాహమని? వారంరోజులు మతస్వీకారానికి గడువుపెట్టాడు. ఆ ఆదివారానికి నెలరోజులకే వివాహ ముహూర్తం పెట్టాడు.

క్షణం ఒకయుగంలా ఉన్నది మోహనరావుకి. శనివారంనాడురాత్రి అతడు తనబసలో కూర్చుండి "హిందూ" పేపరు చదువుకుంటున్నాడు. అర్ధరాత్ర మయింది. అతడు దీపం తగ్గించి శయనించినాడు. ఇంతలో ఎవరో తలుపుతట్టినారు. అతడు తలుపు తీశాడు. ముసుగు వేసికొన్న ఒకవ్యక్తి లోపల ప్రవేశించింది.

"ఎవరు?" అన్నాడు మోహనరావు.

"నేను మేరీసరళని" అని ముసుగు తొలగించింది.

"ఆహా! ఏమి నా అదృష్టం?"

"గట్టిగా మాట్లాడకండి. ఈ మతప్రచారకులు మనల నిద్దరినీ మోసగిస్తున్నారు. మిమ్ము తమ మతంలో చేరేదాకా మంచిమాట లాడతారు. తరవాత నన్నెవరికో యిచ్చి పెండ్లిచేస్తారట. నిన్నరాత్రి విన్నాను, వాళ్లమాటలు. ఈ ఊళ్లో ఎవరో కాలేజీ లెక్చరరు కొడుకు నన్ను చూచి, తండ్రితో చెప్పాడుట. నన్ను గాని వివాహం చెయ్యకపోతే చనిపోతానని శపథం చేశాడట. అతనితండ్రి వచ్చి వేయిరూపాయ లిస్తానన్నాడుట మతప్రచారానికి, విరాళంక్రింద. అందుచేత వీళ్లు నన్నాతని కిచ్చి పెండ్లిచేస్తామని భీమవరంలో ఉన్న ఉపాధ్యాయకి ఉత్తరం వ్రాయగా ఆమె అందుకు సమ్మతించిందట. మరి మనం ఏం చెయ్యాలో తెలీక మీదగ్గరికి పరిగెత్తుకు వచ్చా."

"పోని. ఆతణ్ణి వివాహం చేసుకో. నేను ఎక్కడి కైనా పోతాను."

"ఇదా, మీ రనేమాట, ఆఖరుకు. మీహృదయం మారిపోయింది కాబోలు. పోనీలెండి. మీకు నేను భారమైతే నన్ను భరించడానికి గోదావరి ఉంది. ఇంక సెలవు."

అని మేరీసరళ వెళ్లిపోబోయింది.

"ఆఁ ఆఁ! ఆగు" అని మోహనరావు ఆమె చేయి పట్టుకుని, "ఇంతకోపం ఎందుకో?" అని తన దగ్గరికి తీసుకుని, "మరేం ఫర్వా లేదు. సరియైన సమయానికి వచ్చి చెప్పి రక్షించావు. తెల్లవారితే క్రైస్తవ మతం స్వీకరించి ఉందును గదా? మనం వారి కెవరికీ కనబడకుండా వెళ్లిపోదాం. నిన్ను హిందూమతంలో తిరిగి చేర్పిస్తా" అన్నాడు.

నిమిషంలో సామాను సర్దుకొని ఆప్రేమ మూర్తు లిద్దరూ ప్రపంచాన్ని ఆవరించిన అంధకారంలో మాయమైపోయినారు. నిశ్శబ్దాధిదేవత వారిమీద మంగళాక్షతలు చల్లింది.

౫

రామయ్యకు చాలా జబ్బుగా ఉన్నది. పాపం, రెండువందలకూ ఆశపడి కూతుర్ని వారితో పంపించిన నాటినుండీ ఆతనికి మనస్సులో ఆందోళన ఎక్కువైంది. ఆధనము పూర్తిగా కర్చయిపోయింది. ఇంక తనమరణం కొన్నిగంటలలో ఉన్నదని గ్రహించి, తన్ను కనిపెట్టుకొని కూర్చున్న బంధువుల పిల్లవాణ్ణి పిలిచి, "నాయనా! వెంకటప్పయ్యగార్ని ఒకసారి తీసుకురా" అన్నాడు.

రాత్రి పదిగంట లయింది. వెంకటప్పయ్యగారు రాత్రి నిద్రపోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు ఆపిల్లి

వాడు వెళ్లి చెప్పాడు. వెంకటప్పయ్య బయలుదేరి వెళ్లాడు. కామయ్య కుర్రవాణ్ణి బయట ఉండమని చెప్పి ఆయాసపడుతూ ఇలా అన్నాడు:

"బాబూ! నే నింక రెండు మూడుగంటలలో చనిపోతాను. నేను తమరికి ఒకవిషయంలో అపచారం చేశాను. చేసినపాపం అంగీకరించి, పశ్చాత్తాపపడితే మనస్సుకి ఊరట కలుగుతుంది. చెప్పమంటారా? నన్ను క్షమిస్తానని అభయం యివ్వగలరా?"

"మరేం భయం లేదు. అదెంత గురుతరాపరాధ మైనా నేను క్షమిస్తాను. సందేహించక చెప్పు" అన్నాడు వెంకటప్పయ్య.

"బాబూ! పదహారుసంవత్సరాలపూర్వం జరిగిన విషయం. అప్పటికి నేను మీకొలువులో ప్రవేశించి ఒక్కసంవత్సర మయింది. ఒక నాటిరాత్రి నేను పొలంలో నిద్రపోతూన్నసమయాన ఒకస్త్రీ వచ్చి నన్ను లేపి కొన్నినగలు నాచేతిలో పెట్టి 'యీపిల్లని జాగ్రత్తగా పెంచుకో; నీకు సంవత్సరం గడచినపిదప మళ్లీ కొంత సొమ్ము యిస్తాం' అని చెప్పింది.

"'ఎవ రీపిల్ల' అని ప్రశ్నించగా 'బాబూ! ఏం చెప్పను—మీకుమార్తె' అని బదులు చెప్పింది. ఇంక మగబిడ్డలు పుట్టరేమో అని, ఆస్తి వారసులకి చెందకుండా ఉంచటానికి మంత్రసాని సహాయమున ఎవరిమగ బిడ్డనో తెచ్చి, మీఅమ్మాయిని నన్ను పెంచుకోమని పంపారు మీభార్యగారు. సరళ అని పేరు పెట్టాను ఆపిల్లకి—"

అని ఏడ్చి మళ్లీ ఆరంభించాడు—

"ఆపిల్లని, దారిద్ర్యం అనుభవించలేక, క్రైస్తవ మతస్థులు వచ్చి రెండువందలరూపాయ లిస్తామంటే ఆశపడి వారి కిచ్చేశాను. ఆమెకుడిచెంపమీద పుట్టుమచ్చ ఉంది. ఒకతావేజు పట్టుత్రాడుకు కట్టి కంఠమున ఉంచాను. ఆమెసంగతి యీఊళ్లో ఉన్న మిస్సమ్మ నడిగితే తెలుస్తుంది."

అని కామయ్య ప్రాణాలు విడిచినాడు.

౬

"మీకు మంచిబహుమతీ యిప్పిస్తాం. చెప్పండి సరళ అనే అమ్మాయి ప్రస్తుతం ఎక్కడ ఉన్నదో. లేకపోతే అనవసరమైన చిక్కులు తటస్థించుతవి" అన్నాడు భీమవరం సర్కిలుయినస్పెక్టరు రంగారావు నాయుడు. ఉపాధ్యాయ మొదట నసిగింది కాని తరవాత నిజం చెప్పింది. రంగారావునాయుడు రాజమండ్రి పోలీసుసర్కిల్ యినస్పెక్టరుకు ఒకఉత్తరమూ, మేజస్ట్రేట్టుకు ఒకఉత్తరమూ వ్రాసి వెంకటప్పయ్యగారి కిచ్చి, ఒకపోలీసునుకూడా పంపాడు.

ఆ ఉత్తరాలు తీసుకొని రాజమండ్రి వెళ్లి వెంకటప్పయ్యగారు సర్కిల్ ఇనస్పెక్టరుని కలుసుకొని సంగతంతా చెప్పాడు. నలుగురుపోలీసులను వెంటబెట్టుకొని సర్కిల్ యినస్పెక్టరు మిషనరీలు ఉండేచోటుకి వెళ్లి పరిశోధన చేశాడు. ఆమిషనరీలు మోహనరావనునత డామెను వివాహమాడుటకు వచ్చాడనీ, ముహూర్తం నిశ్చయించామనీ, ఆకస్మికంగా ఎవరికీ తెలీకుండా యిద్దరూ పరారయ్యారనీ చెప్పి ఆమెను ఎల్లాగైనా పట్టుకొని తమకు వప్పగించవలసిందనికోరారు. వారుకూడా స్టేషనులో రిపోర్టు చేశారు.

పదిమందిపోలీసులని బస్సుస్టాండుదగ్గర ఒకర్నీ, పడవల రేవులో ఒకర్నీ, రెండు రైల్వేస్టేషనులలో కొందరినీ ఆనవాళ్లు చెప్పి వెతికి పట్టుకోమని అజ్ఞాపించాడు సర్కిల్ యినస్పెక్టరు.

ఆరాత్రి రాజమండ్రి స్టేషనుదగ్గర మెయిలు ఎక్కబోతూ ఉండగా పోలీసులు అనుమానపడి మోహనరావునీ, సరళనీ గోదావరిస్టేషనులో దింపివేశారు.

మరునాడు మేజస్ట్రీటుకచేరీలో విచారణ. ఈ సమాచారం క్షణంలో రాజమండ్రినగరాన వ్యాప్తమయింది. పర్యవసానం వినడానికి పనిలేక తీరుబడిగా తిరిగే పెద్దలు చాలామంది వచ్చి కూర్చున్నారు. అందరి దగ్గరా వాజ్మూలాలు తీసుకొని మేజస్ట్రేటు ఆమెను పిలిచి చెంపమీద పుట్టుమచ్చనీ, మెడలోని రక్షాబంధనాన్నీ పరీక్షించి యిలా తీర్పుచెప్పాడు—

"ఈమె వెంకటప్పయ్యగారి కుమార్తె. విధివశమున కామయ్య పెంచుకోవలసివచ్చింది. ఈమె యింతటి నుండి వెంకటప్పయ్యగారి కుమార్తె. మైనరుబాలికను తమమతంలో చేర్చుకోవడం మిషనరీల తప్పు."

మిషనరీలు తలలు వంచుకొని వచ్చినత్రోవను తిరిగి వెళ్లిపోయారు. మోహనరావు "కథ అడ్డంగా తిరిగిందేమిట"ని మేజస్ట్రేటుగారిదగ్గరకు వెళ్లి, "అయ్యా! నామాట ఏం చెప్పారు?" అని ప్రశ్నించాడు.

"మరీ అందంగా ఉందబ్బాయి నీప్రశ్న! నిన్ను ప్రేమించినపిల్ల, ఆమెతండ్రి ఎదర ఉన్నారుగా, వారి నడుగు. నన్నడిగితే నేనేం చెయ్యగలుగుదును?"

వెంకటప్పయ్యగారు మోహనరావుకేసి చూచి, "మాతో భీమవరం రావోయి. నీవిషయం అక్కడ ఆలోచించి ఏర్పాటు చేస్తాను" అన్నారు.

ఆరాత్రి మోహనరావుకు ఒళ్లుతెలియనంతజ్వరం వచ్చింది. భీమవరం స్టేషనులో రైలాగగానే, వెంకటప్పయ్యగారు కుమార్తెను ఇంటిదగ్గర దింపి, మోహనరావు నాతని యింటిదగ్గర దిగబెట్టి వెళ్లిపోయాడు.

౭

డాక్టరు వచ్చి మందిచ్చాడు మోహనరావుకు. మధ్యాహ్నం మూడుగంటలయింది. ఆతనిసతి కమల ఉపచారాలు చేస్తున్నది. తల్లి కూడా దగ్గరకూర్చుని ఉంది. ఇంతలో ఎవరో వస్తే తల్లి అవతలకి వెళ్లింది. మోహనరావు కమలచేతులు పట్టుకొని, "కమలా! నేను చేసినతప్పుకు నన్ను క్షమించానని చెబితే గాని నాకు హృదయశాంతి కలగదు." అన్నాడు.

"నాకు మీరు చేసినసంగతి పూర్తిగా తెలిసింది. మీరు వెళ్లినమర్నాడే నేనేమీ అనుకోలేదు. నాకు ఎంతమాత్రమూ కష్టము తోచలేదు."

"కమలా! నేనింక బ్రతుకుతానో బ్రతకనో, ఒకసారి సరళని చూస్తే నిశ్చింతగా ప్రాణాలు విడుస్తా."

"అబ్బా! సుఖంమల్లే అలాంటి అశుభవాక్యాలు అనకండి" అన్నది కమల.

ఆమె వెంటనే వెంకటప్పయ్యగారి యింటికి వెళ్లి సరళతో మాట్లాడి, "నిన్ను నాచెల్లెలిలా చూసుకుంటాను, రా; వచ్చి ఆయన్ను రక్షించు" అని చెప్పి తనతో కూడా తీసుకువెళ్లింది.

సరళ మోహనరావుగదిలో ప్రవేశించింది; దగ్గర కూర్చుంది. మోహనరావు, "సరళా వచ్చావా? నాకు భార్య, కుమారుడూ ఉన్నారని తెలిసి కోపగించావా?" అన్నాడు.

"నేను ఏమీ అనుకోలేదు. ఆమె నాసోదరి కాదా?" అన్నది.

౮

మోహనరావారోగ్యవంతుడైనాడు. సరళ హిందూమతం స్వీకరించింది. కమల శ్రమపడి వారిద్దరికీ వివాహం చేసింది.

*        *        *        *

మనోహరంగా అలంకరింపబడిన గదిలో సోఫా మీద సరళ కూర్చుని నవల చదువుకుంటూన్నది. మోహనరావు తనకుమారుడైన గోపాలమోహనుని ఎత్తుకొని గదిలోకి వెళ్లి, "బాబూ! ఈఅమ్మాయి ఎవర్రా" అన్నాడు.

"పిన్ని—పిన్ని—చిన్నపిన్ని" అన్నాడు. గోపాలమోహనుణ్ణి ముద్దుపెట్టుకోబోయిందిసరళ. మోహనరావు కూడా ఆమెముద్దుపెట్టుకొన్నప్పుడే తానుగూడా ముద్దుపెట్టుకోబోయాడు, కుమారుణ్ణి. గోపాలమోహనుడు సరళామోహను లిద్దరూ తన్ను ముద్దుపెట్టుకోవడానికి ముందుకు వంగేటప్పుడు వెనక్కి వాలినాడు. సరళామోహనుల పెదవులు కలుసుకొన్నవి.